## క్లుప్తంగా

### వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న అపోలో వైద్యులు

బోట్‌క్లబ్: ఆయిల్ ఇండియా లిమిటెడ్ కేజీ బేసిన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జగన్నాథపురం జనావళి వృద్ధాశ్రమంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆయిల్ ఇండియా కేజీ బేసిన్ ఈడీ అంజన్ జ్యోతి ఫుకాన్ ప్రారంభించారు. సుమారు 150 మందికి అపోలో ఆస్పత్రి వైద్య బృందంతో వైద్య సేవలందించి మందులు అందించారు. అనంతరం గోదావరి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు చంద్ర మల్లిక, సెక్రటరీ మైత్రీ భట్టచార్య తదితరులు పాల్గొన్నారు.

### జార్జిపేటలో పశుగ్రాస వారోత్సవాలు



పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సుధ

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేట నంది బొమ్మ వద్ద పశుగ్రాస వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డి.బ్రహ్మవేద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తిగొంది వెటర్నరీ వైద్యురాలు దవులూరి సుధ పశుగ్రాస సాగు గురించి పాడి రైతులకు వివరించారు. పశుగ్రాసం వల్ల పాడిరైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజరం వెటర్నరీ వైద్యుడు రమణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

### నిరుపయోగంగా సోలార్ బ్లింకర్లు



కాకినాడ రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలోని బ్లింకర్ పరిస్థితి

సామర్లకోట: ప్రమాదాల నివారణకు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన సోలార్ స్తంభాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ సంస్థ కాకినాడ రోడ్డులోను, పంచారామ క్షేత్రానికి వెళ్లే గోదావరి బ్రిడ్జి వద్ద, ఆయా ముఖ్య కూడళ్లలో, మలుపుల్లో సోలార్ బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేశారు. ఆ స్తంభాలకు నేడు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయి అసలు అక్కడ ఓ స్తంభం ఉందన్న విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆ మొక్కలను ఆర్ అండ్ బీ అధికారులు తొలగించాల్సి ఉంది. అధికారులు స్పందించి సోలార్ బ్లింకర్లను వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఖాళీ స్థలాలు.. దోమల కార్ఖానాలు!

- అప్రమత్తం కాకుంటే అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం
- జాగా కనిపిస్తే చాలు స్థానికులకు అదే డంప్ యార్డు
- వారినే అనుసరిస్తూ ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్న పారిశుధ్య సిబ్బంది



తూరంగి పగడాలపేట వద్ద గుట్టగా పేరుకుపోయిన చెత్తచెదారం



ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో బయటకు వెళ్లే దారిలేక ఏళ్ల తరబడి పేరుకుపోయిన మురుగునీరు

కాకినాడ సిటీ: ఖాళీ స్థలాలు వ్యాధులకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్త వేస్తున్నారు. వ్యర్థాలు, చెత్త, చెదారం, ప్లాస్టిక్ ఖాళీ స్థలాల్లో పడవేయడం ద్వారా దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

**ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం**

కాకినాడ నగరపాలక సంస్థతో పాటు గ్రామాల్లో ఖాళీ స్థలాలు చెత్త చెదారానికి నిలయంగా మారుతున్నాయి. నగరంలోని సాంబమూర్తినగర్, దుమ్ములపేట, పర్లోవపేట, కొత్త కాకినాడ, గొడారిగుంట, ఏటిమొగ, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంట చెత్త దర్శనమిస్తోంది. కాకినాడ రూరల్ మండలంలోని తూరంగి, రమణయ్యపేట, కొవ్వూరు, తిమ్మాపురం, సర్పవరం, ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, వాకలపూడి, వలసపాకల, పండూరు, నేమాం, కరప మండలంలోని అనేక గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తూరంగి పంచాయతీలో జనావాసాలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చుట్టుపక్కల వారు చెత్త వేసేస్తున్నారు. కొందరు పంచాయతీ సిబ్బంది కూడా బళ్లతో తీసుకువచ్చే చెత్తను ఇక్కడే వేసేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం డంప్‌యార్డును తలపిస్తూ ముక్కుపుటాలు అదిరిపోయే పరిస్థితి నెలకొంది. తూరంగి గ్రామంలో రూ. కోట్ల ఖర్చుతో డ్రైనేజీలు వేసినా ప్రజలకు ఉపయోగపడక పోగా, చుక్క మురుగునీరు కూడా పారడం లేదని, ఎక్కడ నీరు అక్కడ నిలచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, అనేక మంది రోగాల బారినపడుతున్నామని చెబుతున్నారు.

**ఎక్కువైన కుక్కల సంచారం**

ఖాళీ స్థలాల్లో వేసిన వ్యర్థాల కోసం కుక్కలు ఎగబడుతున్నాయి. ఈ క్రమంలో కుక్కల సంతతి అంతకంతకూ పెరగడమే కాకుండా ఆ వ్యర్థాల కోసం వాటికవి కలబడుతూ ఆ వైపుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులపై ఎక్కడ పడతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో వేసిన చెత్త చెదారంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. చెత్త నిల్వలు,

**వ్యాధులు ప్రబలే అవకాశం**

వాటికి తోడు వర్షాలు పడితే నానిపోయి నీరు నిల్వ ఉండిపోయి దోమల కార్ఖానాలుగా తయారవుతున్నాయి. పర్యవసానంగా డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తక్షణమే తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

**చెత్తను తొలగించకపోతే జరిమానా**

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో స్థలాలను కొందరు కొనుగోలు చేసి ఖాళీగా వదిలేయడంతో ఆ స్థలాల్లో వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. దీని వల్ల సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా వదిలేసిన స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తను స్థల యజమానులు తక్షణం తొలగించాలని నోటీసులు జారీ చేస్తున్నాం. ఏ కారణం చేతనైనా స్థల యజమానులు అందుబాటులో లేకపోతే నగరపాలక సంస్థే ఆయా స్థలాల్లో ఉన్న వ్యర్థాలను తొలగించి, అందుకు అయ్యే ఖర్చును స్థల యజమానుల నుంచి వసూలు చేస్తాం. ఇప్పటికే ఖాళీస్థలాల యజమానులకు చెత్త తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం.



– జె.వెంకటరావు, నగరపాలక సంస్థ కమిషనర్, కాకినాడ

### వైభవంగా వారాహి పూజలు



కొవ్వూరులో కొలువై ఉన్న అమ్మవారు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో కొలువై ఉన్న వారాహి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని భక్తులు వివిధ రకాల పండ్లు, పూలతో అంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తు తరలి వచ్చి అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించి, ప్రసాదాలను స్వీకరించారు.

### కాపుల గురించి మాట్లాడే అర్హత లేదు

కాకినాడ సిటీ: కాకినాడ టీడీపీ ఎంపీగా 1999లో గెలిచిన ముద్రగడ పద్మనాభానికి చంద్రబాబును, సొంత నిధులతో రైతులకు పరిహారం ఇచ్చిన పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదని ఉభయ తూర్పుగోదావరి జిల్లా కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోకేడ రాంబాబు ధ్వజమెత్తారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కాపు రిజర్వేషన్లపై ముద్రగడ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాంబాబు ధర్నా చేశారు. రెడ్డిగా మారిన ముద్రగడకు కాపుల గురించి మాట్లాడడం సరికాదన్నారు. ధర్నాలో కాపు యుత నాయకులు ముమ్మిడి విష్ణు, నాగుమళ్ల బెనర్జీ పాల్గొన్నారు.

# అతిసారంపై ఆరా



అతిసార బాధిత నివాసిత ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీచరణ్

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు పరామర్శ
- బాధితుల నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం పరిశీలన

కాకినాడ: కాకినాడ దుమ్ములపేట, పర్లోపేట ప్రాంతాల్లో ముగ్గురు అతిసార బారిన పడడంతో నగర పాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్ శనివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అతిసారం బాధితుల నివాసిత ప్రాంతాల్లో నగర పాలకసంస్థ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా ప్రాంతాలను పరిశుభ్రం చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది నీటి నమూనాలను పరిశీలించారు. నీటి లోపం లేదని నిర్ధారణకు వచ్చారు. పరిసరాల పరిశుభ్రత, ఆహార లోపం వంటి కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అతిసారంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బెంగాలీ కూలీల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారులు

**కరప వైద్యాధికారుల ఆరా..**

కరప: మండలం యండమూరు శివారు వడ్డిపాలెం రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్న బెంగాలీ కూలీలు అస్వస్థతకు గురై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మండల వైద్యాధికారులు కలిసి ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలోని ఎపిడమిక్ సెల్‌లో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఎస్‌లు సీహెచ్ శ్రీనివాస్, ఎస్‌వీ రామారెడ్డి, వి.శ్రీనివాస్‌లతో కలిసి 12 మంది బెంగాలీ కూలీల ఆరోగ్యపరిస్థితిని పరిశీలించారు. అందులో ముగ్గురికి డయాలసిస్ చేశారని, ప్రాణాపాయం లేదని, అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

# లక్షణమైన పోస్టు కోసం లాబీపాట్లు

- ఉభయ కుశలోపరిగా పచ్చనేతలు
- అనుయాయుల సారథ్యంలో పైరవీలు
- పురుడు పోసుకున్న టీటీ సంస్కృతి



కాకినాడ క్రైం: కాకినాడలో పోలీస్ పోస్టింగుల పైరవీల తంతు పచ్చరంగు పులుముకుంది. సీఐల స్థాయిలో బదిలీల కోసం రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కాకినాడ గ్రామీణ, సిటీ నియోజకవర్గాల అధికార కూటమి సారథులు ఈ అడ్డగోలు అరాచకానికి అన్నీ తామై వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అర్బన్ నాయకుడికి నీడగా కొనసాగుతున్న ఆయన రక్త సంబంధీకులు కాకినాడ నగరం పరిధిలోని పలు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓల మార్పిడిపై దృష్టిసారించారు. చౌక్కా మార్చినంత తేలికగా పోస్టింగులు మార్చేస్తామంటూ నమ్మబలికి ఈ ఘన కార్యానికి రూ.లక్షల మొత్తాన్ని ధరగా నిర్ణయించారు. ఆ దిశగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్య సీటు ధరను ఫైనల్ చేశారు. సగం ముందు ఇచ్చిపొమ్మని, ట్రాన్స్‌ఫర్ వచ్చాక మిగిలిన మొత్తం ఇవ్వాలంటూ పెద్ద మనసుతో వాయిదాల పద్ధతిని ప్రవేశపెట్టారని తెలుస్తోంది. ముఖ్యంగా కాకినాడలో వన్ టౌన్ స్టేషన్ చుట్టూ బేరసారాలు తారా స్థాయిలో సాగుతున్నాయి. 'జీఎస్‌టీ పాయింట్లు' అని పోలీసులు ఖద్దర్ల సర్కిళ్లలో ముద్దుగా పిలుచుకునే 'కలక్షన్ పాయింట్లు' ఈ పరిధిలో ఉండడమే ఇంతటి డిమాండ్‌కు కారణమని డిపార్ట్‌మెంట్‌లో కీలక హోదాల్లో ఉన్న అధికారులే అంటున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో పనిచేస్తున్న ఓ సీఐ కాకినాడ టూ టౌన్‌కు బదిలీపై వచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆయన రావాలి అనుకుంటున్న ఈ స్టేషన్‌లోనే గతంలోనూ సీఐగా పనిచేసి ఉండడం ఇక్కడ కొసమెరుపు. ఈ స్టేషన్‌కే రావాలనుకోవడంలో ఎందుకు ఈ సారికి అంతటి ప్రయాసన్న ప్రస్తావన కింది స్థాయిలో చక్కర్లు కొడుతోంది. అలవాటు పడ్డ జీఎస్‌టీ పాయింట్లు ఉన్నాయేమోనంటూ నవ్వేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి రోజుల నుంచే రాజమహేంద్రవరం నుంచి సదరు అధికారి కాకినాడకు వస్తూ పోతూ పచ్చనేతకు పచ్చనోట్లు ఎరవేశారనే ప్రచారం నడుస్తోంది. అలాగే సర్పవరం పీఎస్ సీఐ సీటు హాట్ సీటుగా అవతరించింది. ఇండస్ట్రియల్ ఏరియా పరిధి కావడం ఈ స్టేషన్ ప్రత్యేకత. గ్రామీణ నియోజకవర్గ నేత కుటుంబం పోస్టింగ్‌ల గురుతర బాధ్యతలు నెత్తికెత్తుకుంది. సర్పవరం సీఐ పోస్టును ఆశిస్తున్న నలుగురు అధికారులతో అనధికార వేలంపాటకు తెరతీశారు. ఒకటో సారి రెండో సారి అంటూ తూకానికి అనుగుణంగా సంతలో పశువుల రీతిలో అధికారిని ఫైనల్ చేయనున్నారు. నగరంలోని అర్బన్, గ్రామీణాల పరిధిలో బల్లకింద చేతులకు అవకాశం ఉన్న స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓ పోస్టింగ్ ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయని టాక్ నడుస్తోంది. లంచావతారాల దురుద్దేశానికి కొమ్ము కాస్తున్న కూటమి నేతలు 'ట్రాన్స్‌ఫర్ ఆన్ ట్రాన్సాక్షన్'(టీటీ) సంస్కృతికి నిస్సిగ్గుగా తెరతీశారనే ఆరోపణ పోలీస్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. రూ.లక్షల మొత్తాలు వెచ్చించి మరీ పోస్టింగ్‌లు పడుతున్న వీరంతా పనిచేస్తారా లేదా స్టేషన్ల కేంద్రంగా కలక్షన్ పాయింట్లు తెరుస్తారా అన్న చర్చ సామాన్య జనాల్లో ఊపందుకుంది.

# తలలు పండినా.. తలపులు కొంటెవే..!

- గతకాలపు మాధుర్యంలో లూథరన్ పూర్వ విద్యార్థులు
- ఆత్మీయంగా సందడి చేసిన 1967–69 ఎస్‌ఎస్‌ఎల్‌సీ బ్యాచ్‌లు



లూథరన్ పాఠశాలలో జ్ఞాపకాలను పదిలపరచుకుంటున్న పూర్వ విద్యార్థులు

పెద్దాపురం: వారందరికీ దాదాపు ఏడు పదుల నుంచి ఎనిమిది పదుల వయస్సు దాటింది. వారందరికీ తలలు పండిన పిల్లలు ఉంటారు. తనువుకే వయసు కానీ.. మనసుకు ఉండదు కదా.. శారీరకంగా నేడు కొంత లొంగి ఉండవచ్చు కానీ మానసికంగా వారు నేటికీ అల్లరి పిడుగులేనని చెప్పకనే చూపారు. బోసి నవ్వుల గలగలలు.. గతం గుర్తు చేసిన అల్లరి పనులు వారిని నేడు గిలిగింతలు పెట్టాయి. వారి అల్లర్లకి వేదికైంది స్థానిక పెద్దాపురం లూథరన్ పాఠశాల. 1967–69 ఎస్‌ఎస్‌ఎల్‌సీ రెండు బ్యాచ్‌ల విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వారంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వివిధ హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు ఒక చోట కలిసి తమ గతకాలపు అల్లర్లలోకి వెళ్లిపోయారు. హోదాలు, అంతరాలు మరచి ఏకవచన సంబోధనలతో, నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ, అప్పటి గురువులను, తోటి ఆడపిల్లలను ఆటపట్టించిన సరదా సంఘటనలతో సందడి చేశారు. కలుసుకున్న కొద్ది సేపూ ఎన్నో ఏళ్ల జ్ఞాపకాల దొంతరల్లోకి వెళ్లిపోయి వర్తమానంలోకి వచ్చి ఒకరికొకరు ఆరోగ్యాలు, పిల్లల స్థితిగతులు పంచుకుని సంతోషాల్లో మునిగి తేలిపోయారు. స్థానిక మట్టే ఆదినారాయణ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సమావేశమైన వారంతా ముందుగా తాము చదివిన లూథరన్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు అవసరమైన బల్లలను విద్యార్థులకు అవసరమైన బల్లలను బహుకరించారు. ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ వారిలో కొందరిని మిగిలిన వారు సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త, దాత మట్టే సత్యప్రసాద్, పారిశ్రామిక వేత్త గోలి రామారావు, విశ్రాంత ఉద్యోగులు బద్ది కృష్ణ విద్యాసాగర్, థామస్‌తో పాటు సుమారు వంద మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆనాటి అల్లర్ల దొంతర్లతో నేటి కుర్రాళ్ల ముచ్చట్లు

### ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి సత్కారం

తాళ్లరేవు: చొల్లంగిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కోరాటి పూర్ణ షర్మిల శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పూర్ణ షర్మిలను స్కూల్ ప్రిన్సిపాల్ పి.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ షర్మిల చదువులో ముందుండి పదో తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. షర్మిల భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమావతి, పరిపూర్ణ, కనకావతి, పార్వతి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.



పూర్ణ షర్మిలను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు

# అప్రమత్తతే ఆయుధం

- వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న వ్యాధులు
- అప్రమత్తమైన అధికారులు
- వ్యాధుల వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించడంతో పాటు వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా వ్యాధులకు కారణమయ్యే దోమలు, క్రిమికీటకాలను ఆదిలోనే నిర్మూలించేలా చర్యలు చేపట్టారు.

**గ్రామాల్లో ప్రత్యేక చర్యలు**

దోమలు, ఈగలు, మట్టి మలినాలు, అపరిశుభ్ర వాతావరణం, చేతులు శుభ్రం చేయకపోవడం, నీరు కలుషితం వంటి వాటి వల్ల వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్న విషయాన్ని ప్రజలకు వివరించడమే వాష్ ప్రోగ్రాం లక్ష్యం. దీనిలో భాగంగా గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే చేస్తున్నారు. అంతేకాకుండా వెక్టార్ బోర్న్, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు కలగజేసే దోమల నివారణకు చర్యలు తీసుకోవడం. శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. అంటువ్యాధులకు కారణమయ్యే కుళ్లిన, నిల్వఉన్న ఆహార పదార్థాలు తినకుండా ప్రజలను అప్రమత్తం చేయడం. చేతులను శుభ్రం చేసుకునే విధానాలను ప్రజలకు వివరించడం వంటి చర్యలు తీసుకోవడం. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దోమలు గుడ్లు పెట్టే అవకాశాలున్న పరిసరాలను గుర్తించి దోమలను లార్వా దశలోనే నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

**గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది**

వైద్యారోగ్య శాఖాధికారులు గ్రామాల బాట పట్టారు. బృందాలుగా విడిపోయి పల్లెల్లో పర్యటిస్తున్నారు. గృహాలను సందర్శించి రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు, గోతులు, ఖాళీ డబ్బాలు, డ్రైన్లు వంటి వాటిని పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేస్తున్నారు. ముఖ్యంగా బురద, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని అన్ని మురికి కాలువల్లోనూ దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి ఇళ్లల్లో జ్వర లక్షణాలు ఉన్నవారికి తక్షణ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

**ముందు జాగ్రత్త చర్యలతో నివారణ**

గొల్లప్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. ఎక్కడ దోమలు వ్యాప్తి చెందుతాయో గుర్తించి వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలో ప్రతిరోజూ 30 కుటుంబాలను సందర్శించి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాం. మలేరియా, మెదడు వాపు, స్వైన్ ఫ్లూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, నీళ్ల విరేచనాలు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు వివరిస్తున్నాం. ప్రజలు పరిశుభ్రత పాటించాలి. తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ శ్యామల, వైద్యాధికారి గొల్లప్రోలు

### నియోజకవర్గ ఉద్యోగుల సంఘం ఏర్పాటు



పిఠాపురం నియోజకవర్గ ఉద్యోగుల సంఘం సభ్యులు

పిఠాపురం: నియోజకవర్గంలో నివాసం ఉంటున్న ఉద్యోగులతో శనివారం పిఠాపురం నియోజకవర్గ ఉద్యోగుల సంఘం (పీఈడబ్ల్యూ)ను శనివారం ఏర్పాటు చేశారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన సంఘాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల శాఖ, కులం, మతం రాజకీయాలకు అతీతంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలో నివసిస్తున్న ఉద్యోగులందరినీ ఏకం చేయాలనే దృక్పథంతో ఈ సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఐక్యమత్యమే లక్ష్యంగా సంఘం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ ఏవీవీ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రావు అప్పారావు, డాక్టర్ విజయ శేఖర్, పీసీఈడబ్ల్యూ ఫౌండర్ చామంతి నాగేశ్వరరావు, అధ్యక్షుడు చందు బాబూరావు, జనరల్ సెక్రెటరీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### 19న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తుని: అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ఈ నెల 19న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుతున్నట్టు డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీపురం, పౌర్ణమి రోజున అరుణాచలం గిరిప్రదక్షిణ అనంతరం కంచి దర్శనం ఉంటుందన్నారు. పెద్దలకు టికెట్టు రూ.3500, పిల్లలు రూ.2625గా నిర్ణయించామన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.